క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థిని


శిరీష

వెంకటాచలం : కాకినాడలో ఈనెల 23 నుంచి 24వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రగ్బీ పోటీలకు మండలంలోని గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని శిరీష ఎంపికైంది. ఈ సందర్భంగా చిన్నారిని హెచ్ఎం లక్ష్మీకామేశ్వరి దేవి, పీడీ షేక్.షబిక బుధవారం అభినందించారు.

ఇందుకూరుపేట క్రీడాకారుల ప్రతిభ



ఇందుకూరుపేట : బెంగళూరులో జరిగిన నేషనల్ కరాటే టోర్నీలో ఇందుకూరుపేటకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 11 మంది క్రీడాకారులు పాల్గొనగా, పది బంగారు, మూడు సిల్వర్, తొమ్మిది బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు వివరించారు. ఈ మేరకు వారిని బుధవారం ఇందుకూరుపేటలో అభినందించారు.

నూతన పద్ధతులను అమలు చేయాలి

కొడవలూరు : శిక్షణా తరగతుల్లో తెలుసుకున్న నూతన బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు విధిగా అమలు చేయాలని ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనిని ఎంఈఓలు ప్రారంభించి, మాట్లాడారు. పాఠశాలల్లో అమలు చేయాల్సిన అనేక రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నామని, వీటి ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు వై.అంకయ్య, సంగీత రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు.

సులోచనమ్మకు నివాళి


సులోచనమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాకాణి

కోవూరు : పారిశ్రామికవేత్త అనపల్లి అశోక్‌రెడ్డి సతీమణి సులోచనమ్మ ఉత్తరక్రియలు కోవూరులోని వారి నివాసంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నేతలు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, మల్లవరపు చిరంజీవి, కవరగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



పొదలకూరు : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్‌ను మండలంలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సందర్భంగా సుధాకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సనత్‌కుమార్, ఉపాధ్యాయులు బి.సుధాకర్, ఎ.సత్యనారాయణ, షేక్ అబ్దుల్‌రవూఫ్, చిన్నయ్యభారతి, రాజ్యలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

కోవూరు : జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ చెప్పారు. కోవూరు మండలంలోని లేగుంటపాడు గ్రామంలో ప్రగతి యువ కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మరింత అభివృద్ధి చెందడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పండించిన పంటలను ఎగుమతులు చేయడానికి మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీల్లో మొదట రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలియజేశారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా సేకరించిన పంటలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రగతి యువ కేంద్రంలోని సోలార్ కోల్డ్ రూమ్ తదితరాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, నాబార్డ్ డీడీఎం బాబు, మండల ఉద్యాన శాఖ అధికారి ప్రసన్న, మండల ఏఓ ఇందిరావతి, తహసీల్దార్ నిర్మలానంద బాబా, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు గునపాటి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

- జెన్‌కో ఎదుట నిరసన

ముత్తుకూరు : ఏపీజెన్‌కో ప్రాజెక్టులో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య డిమాండ్ చేశారు. మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టు ఎదుట బుధవారం ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సామూహిక రాయబారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. కార్మికులు ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. అనంతరం చీఫ్ ఇంజినీర్ సుధీర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి గోడ భాస్కర్, బద్వేల్ వెంకటేశ్వర్లు, కస్తూరి వనిత, అనిల్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిత


మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : విద్యతోనే బంగారు భవిత సాధ్యమని, ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని మెప్మా కార్యాలయంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని తెలిపారు. చదువుపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో టీచర్ ప్రసన్న, ఐసీడీఎస్ అధికారులు ఉమా, మంజుల, మెప్మా సీఓ నర్మదా పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై సభ రేపు


ఎంపీడీఓ జలజాక్షి

మనుబోలు : ఈనెల 22న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్‌పై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. ఆమె బుధవారం తన కార్యాలయంలో మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులపై గత నెల 4వ తేదీ నుంచి 17వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారని తెలిపారు. వీటిపై బహిరంగ సభ నిర్వహించి నివేదికను చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. పనుల్లో అవినీతి చోటుచేసుకుందని తేలితే రికవరీ చేస్తారన్నారు.

విడవలూరులో పశువైద్య శిబిరం


మాట్లాడుతున్న జేడీ రమేష్‌నాయక్

విడవలూరు : మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిలో ఉచిత పశు వైద్య శిబిరం బుధవారం జరిగింది. పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ కె.రమేష్ నాయక్ పాల్గొని, మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మండలంలో పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలైన జాతి దూడలను ఉత్పత్తి చేయవచ్చని తెలియజేశారు. గొర్రెల పెంపకందారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 106 పశువులకు గర్భకోశ చికిత్స చేసినట్లు వివరించారు. అనంతరం పెయ్యదూడలకు అందాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాడి రైతులకు కాల్షియం, మినరల్ మిక్చర్, విటమిన్ టానిక్‌లను అందజేశారు. నెల్లూరు డీడీ డాక్టర్ నాగమణి, వీపీసీ డీడీ డాక్టర్ సోమయ్య, డీఎల్‌డీఏ ఈఓ శ్రీనివాసరావు, ఏడీ డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ వసంత రాములు, వైద్యులు వాణిశంకర్, ప్రీతి సులోమాన్, షబాన, నరేష్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు


కొడవలూరు : బహుమతులు అందుకున్న విద్యార్థులతో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

కొడవలూరు : విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా సూచించారు. కొడవలూరు గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. పుస్తక పఠన వల్ల సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. అనంతరం రిటైర్డ్ హెచ్ఎం వెంకయ్యను సన్మానించారు. గ్రంథాలయ అధికారిని కె.రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక హైస్కూల్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విడవలూరులో సర్టిఫికెట్ల ప్రదానం


బుచ్చిరెడ్డిపాళెంలో..

- బుచ్చిరెడ్డిపాళెం : ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి ఎం.నారాయణరెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రతిరోజు గ్రంథాలయాలను సందర్శించడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, క్రమశిక్షణ అలవడుతాయన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సామాజికవేత్త గండికోట సుధీర్‌కుమార్‌కు 'జ్ఞానజ్యోతి' పురస్కారం అందించారు. ఎంఈఓ ఎం.దిలీప్‌కుమార్, హెచ్ఎం ఎం.సుజాత, ఉపాధ్యాయుడు సురేష్ పాల్గొన్నారు.
- విడవలూరు : డిజిటల్ గ్రంథాలయంపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని గ్రంథాలయాధికారి టి.నిరూప అన్నారు. స్థానిక లైబ్రరీలో వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆమె బుధవారం మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి చదువుతో పాటు డిజిటలైజేషన్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాషా, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రమేష్, అక్షర స్కూల్ కరెస్పాండెంట్ శ్రీనివాసులు, శ్రీహరి పాల్గొన్నారు.

సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని నాగమాంబపురం గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వేకి సంబంధించిన రాళ్లపై పేర్లను తొలగిస్తున్నారు. ప్రస్తుతం నాగమాంబపురం సచివాలయం వద్ద సర్వే రాళ్లు ఉండగా, వీటిపై ఉన్న 'వైఎస్సార్ జగనన్న భూరక్ష' పేర్లను అక్కడే వదిలేశారు. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాళ్లపై పేర్లను తొలగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకే పేర్లను తొలగిస్తున్నామని తెలిపారు.

శబరిమల యాత్ర ప్రారంభం



ముత్తుకూరు : మండలానికి చెందిన అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో బుధవారం శబరిమల యాత్రకు బయలుదేరారు. ముత్తుకూరులోని వీరాంజనేయస్వామి ఆలయంలో వేకువజామున గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని ప్రత్యేక పూజలు ఆచరించిన తరలివెళ్లారు.

మసీదు తరలింపునకు సమయం ఇవ్వండి


వినతి పత్రం ఇస్తున్న ముస్లింలు

కోవూరు : మండలంలోని పడుగుపాడు రైల్వేస్టేషన్ వద్ద మసీదు తరలింపునకు కొంత సమయమివ్వాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ఓఎస్డీ పెంచలరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహాయకుడు సర్పరాజ్ కోరారు. ఈ మేరకు నెల్లూరు నగరానికి విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఇనమడుగు సెంటర్‌లోని మసీద్ రైల్వే స్థలంలో ఉందని, దీన్ని తొలగించాలని అధికారులు ఆదేశించారని చెప్పారు. వేరే చోట స్థలం చూసేంత వరకు కొంత సమయమివ్వాలని కోరారు. కార్యక్రమంలో మసూద్, షేక్ అహ్మద్‌బాషా, షేక్ షకీల్, షేక్ ఫయాజ్, షేక్ యాసిన్, షేక్ బాషా పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణంపై దాడి

కోవూరు : మండలంలోని పడుగుపాడులో చంద్రమౌళినగర్ ప్రాంతంలో ఓ బెల్టు దుకాణంపై మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ బి.కిశోర్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మన్నేపల్లి శ్రీనివాసులు అనే వ్యక్తి స్థానికంగా బెల్టు దుకాణం నిర్వహిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిశోర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కందలపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. నెల్లూరు నగరం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన సుభాన్, ఇబ్రహీమ్ పని నిమిత్తం ఇస్లాంపేట గ్రామానికి వెళ్లారు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కందలపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో సుభాన్, ఇబ్రహీం గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తుతెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

కోవూరు: గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రామన్నపాళెం గేట్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రోడ్డు ప్రమాదం జరిగి తీవ్ర గాయాలవడంతోనే వృద్ధుడు చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ బుధవారం తెలిపారు.

సాంకేతిక సలహాలు పాటించాలి


ముత్తుకూరు : విత్తన శుద్ధి చేసి చూపుతున్న అధికారులు


పొదలకూరు : ఆల్తుర్తిలో..


కొడవలూరు : నార్తురాజుపాళెంలో..

ముత్తుకూరు : వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సాంకేతిక సలహాలతో వ్యవసాయం చేయడం మంచిదని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. మండల ఏఓ జోత్స్నరాణితో కలిసి బుధవారం బ్రహ్మదేవి పంచాయతీలోని లింగాయపాళెంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఒక కిలో వరి విత్తనాలకు రెండు గ్రాముల కార్బెండిజం మందు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నేల ద్వారా సంక్రమించే వేరుకుళ్లు తెగుళ్లను నివారించడానికి రెండు కిలోల సూడోమోనాస్‌ను 100 కిలోల పేడ ఎరువుతో కలిపి 15 రోజులు నీడలో మగ్గపెట్టి ఎకరా పొలంలో తేమ ఉన్నప్పుడు చల్లుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

విడవలూరు : నారుమడుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని దంపూరు, చౌకచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడుల్లో కాండం తొలుచు పురుగులతో జాగ్రత్తలు వహించాలని, తగిన మోతాదులో మందులు వాడాలని సూచించారు. వీఏఏ పవన్‌కుమార్, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

వరినాట్ల పరిశీలన

పొదలకూరు : మండలంలోని ఆల్తుర్తి, కనుపర్తి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు బుధవారం వరినాట్లను పరిశీలించారు. ఏడీఏ కె.శివనాయక్, ఏఓ ఎ.వాసు రైతులకు పలు సూచనలు చేశారు. వరి నాట్లు వేసే సమయంలో మధ్యలో బాటలు చేసుకుంటే పైరు బాగా పెరుగుతుందన్నారు. బాటల వల్ల గాలి వెలుతురు పంటకు బాగా తగిలి దిగుబడి పెరుగుతుందన్నారు.

కౌలు రైతులు కార్డులు పొందాలి

కొడవలూరు : కౌలు రైతులంతా విధిగా సీసీఆర్ కార్డులు పొందాలని ఏఓ లక్ష్మి కోరారు. మండలంలోని నార్తురాజుపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు సంబంధిత వీఏఏ, వీఆర్వోలను సంప్రదించి సీసీఆర్ కార్డులు పొందాలన్నారు. రైతులు యూరియాను అధిక మోతాదులో వాడడం వల్ల దుష్ఫలితాలు వస్తాయని తెలిపారు. జేవీఓ రాజ్‌కుమార్ పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, వ్యాక్సిన్‌ల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ డి.శివజ్ఞాన, వీఆర్వోలు మల్లికార్జున, ప్రియదర్శిని పాల్గొన్నారు.